2024 ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
శనివారం 30 డిసెంబరు 2023



నూతన సంవత్సర వేడుకల్లో పేకాట జోరు
- ప్రత్యేక ప్యాకేజీలతో ఆకర్షణ
8లో..

పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోని రామగుండం
8లో..



'ఉపాధిహామీ'పై అవగాహన కరువు

పశువులు, కోళ్లు, గొర్రెల షెడ్ల నిర్మాణాలకు నిధులు

పండ్లు, కూరగాయలు,
ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రోత్సాహం

రైతులకు ఉపయోగపడని వైనం..

పట్టించుకోని అధికారులు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

- వీ శ్రీధర్, డీఆర్‌డీవో, పెద్దపల్లి



ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే రైతులకు ఉపయోగమే. పశువుల షెడ్లు, గొర్రెలు, మేకల షెడ్లు, కోళ్ల షెడ్లు, నీటి తొట్టెలు, కూరగాయల పందిళ్లు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ తోటల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, సన్నకారు, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉపాధిహామీ పథకం ద్వారా జాబ్‌కార్డు పొంది, కనీసం 20 రోజులైన ఉపాధి పనులకు వచ్చి ఉండాలి. గొర్రెలు, మేకలు, పశువులు, కోళ్లు ఉన్న వాళ్లు సంబంధిత అధికారులతో ధ్రువీకరణ పత్రం తీసుకోలి. సొంత భూమి ఉండాలని, పశువుల తొట్ల నిర్మాణాలకు నీటి వసతి ఉండాలి. గ్రామపంచాయతీ తీర్మానం పొందిన వాళ్లు ఎంపీడీఓలకు గానీ, ఏపీఓలకు గానీ దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తాం. రైతులకు వీటిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తాం.

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఉపాధిహామీ పథకంపై రైతులకు అవగాహన లేని కారణంగా రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ, సాగుకు ఊతం ఇచ్చే విధంగా ప్రయోజనాలను పొందలేక పోతున్నారు. దీనిపై సంబంధిత శాఖాధికారులు విస్తృత ప్రచారం చేయకపోవడమే కారణమనే విమర్శలున్నాయి. గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రైతులు వ్యక్తిగతంగా కొన్ని పనులు చేసుకునేందుకు అవకాశాలున్నాయి. పండ్ల తోటలు సాగు చేసే రైతులకు మొక్కల కొనుగోలుకు, గుంతల తవ్వి వాటిని నాటేందుకు, నిర్వహణ కోసం 70 వేల రూపాయల వరకు ఉపాధిహామీ ద్వారా ఇస్తున్నారు.

కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు తీగ జాతి కూరగాయలైన బీర, సోర, కాకర, చిక్కుడు, గోరు చిక్కుడు తదితర కూరగాయల పంటలను సాగు చేసేందుకు పందిర్లు వేసుకునేందుకు 90 వేల రూపాయల వరకు ఉపాధిహామీ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగు కోసం కూడా మొక్కలకు, గుంతలు తవ్వేందుకు, నిర్వహణకు లక్ష రూపాయలకు పైగా నిధులు మంజూరుచేయనున్నారు. పశు సంపదను ప్రోత్సహించేందుకు ఆవులు, గేదెల షెడ్ల నిర్మాణం కోసం 80 వేల రూపాయల వరకు, కోళ్లను పెంచేందుకు కావాల్సిన షెడ్ల నిర్మాణానికి 40 వేలు, గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి 70 వేల రూపాయల వరకు మంజూరు చేయనున్నారు.

● సాంకేతిక సమస్యల కారణంగా..

ఉపాధిహామీ పథకం కింద రైతులు తమకు అవసరాలను తీర్చుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఎవరు కూడా ముందుకు రావడం లేదు. ఇవి ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన తర్వాత ఆ వెంటనే నిర్మించుకోవాల్సి ఉంటుంది. మొత్తం పని పూర్తయిన తర్వాతనే బిల్లులు వస్తున్నాయి. ఒక్కోసారి సాంకేతిక సమస్యల వల్ల బిల్లులు రాకపోవడంతో రైతులు పశువుల షెడ్లు, కోళ్ల ఫారం షెడ్లు, గొర్రెల షెడ్లు, నీటి తొట్టీలు నిర్మించుకునేందుకు ముందుకు రావడం లేదు.

కొందరు రైతులు వీటి గురించి అవగాహన లేక ముందుకు రావడం లేదు. పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంచుకునే రైతులకు షెడ్ల నిర్మాణం తప్పనిసరి. తీగ జాతి కూరగాయలు సాగు చేసే రైతులు పందిర్లు తప్పకుండా వేయాల్సి ఉంటుంది. కానీ ఈ పథకాల గురించి సరైన అవగాహన కల్పించలేక పోతున్నారు. ప్రతి ఏటా ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే పనుల్లో 25 శాతం పనులు తప్పనిసరిగా చేపట్టాలనే నిబంధన ఉన్నది. కానీ జిల్లాలో కనీసం 5 శాతం పనులు కూడా కాలేదు లేదు. ఉదాహరణకు గత ఏడాది గొర్రెల, మేకల షెడ్ల కోసం 240 పనులు ప్రతిపాదించి 19 పనులు మంజూరుచేశారు. కోళ్లఫారం షెడ్లను 39 ప్రతిపాదించి 4 మంజూరుచేయగా, అవి పూర్తి దశలో ఉన్నాయి. పశువుల షెడ్లను 320 ప్రతిపాదించగా, 45 మంజూరు చేశారు. వీటి కోసం ఇప్పటివరకు సుమారు 15 లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు.

ఈ పనుల్లో 95 శాతం వరకు మెటీరియల్ కంపొనెంట్, 5 శాతం వరకు లేబర్ కంపొనెంట్ పనులు ఉంటాయి. రైతులకు ఉపయోగపడే ఈ పనుల గురించి సరైన అవగాహన కల్పించకపోవడంతో ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం గొల్ల, కుర్మలకు సబ్సిడీ గొర్రెల పథకం కింద జిల్లాలో 10 వేల మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు.

అయినా గొర్రెల షెడ్లను ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించుకోలేకపోతున్నారు. అవగాహన ఉంటే ఉపాధిహామీ పథకం ఉపయోగమే. పదేళ్ల తర్వాత తిరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధిహామీ నిధులను రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

'ప్రజా పాలన'ను సద్వినియోగం చేసుకోవాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



కొదురుపాకలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, డిసెంబరు 31: ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని కొదురుపాక గ్రామంలో రూ.12.5 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ, రూ.25లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాల ప్రయోజనాలను కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిదులు పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని, నిరుపేదలకు అర్హులకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం వచ్చిన కొన్ని రోజులకు రెండు ప్రధానమైన స్కీంలను అమలుచేశామని, మిగతా వాటిని కూడా అమలు చేయడానికి సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు ఈనెల 6 వరకు పంచాయతీల్లో దరఖాస్తులు సమర్పించుకోవాలని, తర్వాత మండల కార్యాలయాల్లో సైతం ఇచ్చుకోవచ్చన్నారు. సంక్షేమ పథకాలు అందరికీ వస్తాయని ఇందులో ఎలాంటి అపోహలకు పెట్టుకోవద్దన్నారు. ఇండ్ల కోసం చేసుకున్న దరఖాస్తుల్లో పేదలను మాత్రమే ఎంపిక చేయాలన్నారు. కొదురుపాక - పెద్దపల్లి రోడ్డులో ఉన్న హుస్సేనిమియా వాగుపై హైలెవెల్ వంతెన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి..

సుల్తానాబాద్ మండలం మూడేళ్ల కిందట రూర్బన్ పథకం కింద ఎంపిక కాబడి కోట్లాది రూపాయల నిధులురాగా అందుకు సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటి వివరాలను తాను అధికారల ద్వారా సేకరించానన్నారు. అధికారులతో సమీక్ష జరిపి మిగిలిపోయిన, అసంపూర్తిగా ఉన్న రూర్బన్ పనులను మార్చి 31లోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించడం జరిగిందని అధికారులను కూడా ఆదేశించామన్నారు. లేనిచో నిధులు మురిగిపోయే ప్రమాదం ఉందన్నారు. రైస్‌మిల్లర్లతో మాట్లాడి ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలుకు చర్యలు తీసకుంటామన్నారు. సర్పంచ్ దేవరనేని సాగర్‌రావు, ఎంపీపీ బాలాజీరావు మాట్లాడుతూ కొదురుపాక గ్రామానికి కావాల్సిన పలు అభివృద్ధి పనులను మంజూరి చేయించాలని ఎమ్మెల్యేకు సూచించారు. కాగా, సర్పంచ్ ఎంపీపీలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. జీపీ బిల్డింగ్ నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన దళితులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ మినుపాల స్వరూపప్రకాశ్‌రావు, సర్పంచ్ సాగర్‌రావు, బండారి రమేష్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఉపసర్పంచ్‌లు మహేందర్, రామారావు, రాజాగౌడ్, హరీష్, జ్యోతి, అంతటి అన్నయ్యగౌడ్, దామోదర్‌రావు, చిలుక సతీష్, ఎంపీవో ఫయాజ్, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

సుల్తానాబాద్ పట్టణంలోని వైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజరమణారావును ఆర్యవైశ్య సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి బాస్కర్ తదితరులు ఉన్నారు.

అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు

- కేక్‌లు కట్ చేసి స్వాగతం పలికిన ప్రజలు
- కిటకిటలాడిన బేకరీలు, స్వీట్‌హౌస్‌లు, మద్యం షాపులు

మంథని, డిసెంబరు 31: కొన్ని మధుర జ్ఞాపకాలను, మరికొన్ని మరిచిపోలేని ఘటనలు మిగిల్చిన 2023 సంవత్సరానికి మంథని డివిజన్‌లోని ప్రజలు ఆదివారం అర్ధరాత్రి వీడ్కోలు పలికి.. 2024 నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే కొత్త సంవత్సర సంబరాలు ప్రారంభమయ్యాయి. డివిజన్‌లోని మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం మండలాల్లోని యువతీ, యువకులు, పిల్లలు కేక్‌లు కట్ చేసుకొని న్యూఇయర్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పలు బేకరీలు, స్వీట్ హౌజ్‌ల వద్ద మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వందల సంఖ్యలో కేక్‌ల కొనుగోళ్లతో షాపుల ప్రాంగణాలంతా రద్దీగా మారాయి. రాత్రి ఏడు గంటల నుంచి ఊరురా, వాడవాడల్లో యూత్, ప్రజలు న్యూఇయర్ సందడిని ప్రారంభించి నృత్యాలు చేస్తూ, వివిధ కాల క్షేప కార్యక్రమాలతో తెల్లవారుజాము వరకు కొనసాగించారు. రాత్రి 12 గంటల సమయంలో కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేశారు. బంధు మిత్రులకు, కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో గల్లీగల్లీలో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా కొనసాగాయి. యువతీ, యువకులు జీరో డే వేడుకలను తెల్లవారుజాము వరకు ఘనంగా జరుపుకున్నారు.

సుల్తానాబాద్, డిసెంబరు 31: పాత సంవత్సరానికి వీడ్కోలు చెపుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతు సంబరాలు జరుపుకున్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని పలు వార్డులలో వీధులలో కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా కేక్‌లు కట్ చేసి ఆటాపాటలతో సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో క్యాంప్‌ఫైర్ ప్రారంభించి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

రామగిరి, డిసెంబరు 31: మండలంలోని రత్నాపూర్ గ్రామంలో ముక్కెర లక్ష్మణ్ అనే గీత కార్మికుడు ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి కిందపడి గాయపడ్డాడు. ఆదివారం రోజువారిగా గీత వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారీ కిందపడడంతో కాలు విరిగిపోయింది. దీన్ని గమనించిన తోటి గీతకార్మికులు లక్ష్మణ్ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా మల్లన్న బోనాలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 31: మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని యాదవులు, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బోనాల జాతర అంగరంగ వైభవం నిర్వహించారు. సర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు బోనం తలపై ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం మహిళలు బోనంతో ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేశారు.

మల్యాల: మండలంలోని మల్లెగుట్టపై ఉన్న మల్లన్న ఆలయంలో షష్ఠ ఉత్స వాల్లో భాగంగా ఆదివారం పట్నాలు వేశారు. మల్యాల, పెగడపల్లి, జగిత్యాల తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మల్లెగుట్టపైకి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పొలం వద్దనే రైతు ఆకస్మిక మృతి

రుద్రంగి, డిసెంబరు 31: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నంద్యాడపు బుచ్చిమల్లయ్య (68)అనే రైతు గుండెపోటుతో పొలం వద్దే ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యుల కళ్లెదుటే ఆకస్మికంగా మృతి చెందాడు. వరి నాట్లు వేసే పనులు చేస్తుండగా గుండెపోటు రావటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. మృతునికి భార్య నర్సవ్వ, కొడుకు తిరుపతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రాజన్నసేవలో హైకోర్టు న్యాయమూర్తి


ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈవో శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 31: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి వి భాస్కరరెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా, సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, జూనియర్ సివిల్ జడ్జ్ ప్రవీణ్, ఆర్డీవో మధుసూదన్, జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, స్థానిక డీఎస్పీ నాగేం ద్రచారి, పట్టణ సీఐ కరుణాకర్, ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ సూపరింటెండెంట్ శంకర్ పాల్గొన్నారు.

యాసంగి పంటకు సాగునీరు

- కాకతీయ కాలువ నుంచి విడుదల చేసిన మంత్రి పొన్నం


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తిమ్మాపూర్, డిసెంబరు 31: యాసంగి పంట సాగుకు ఆదివారం సాయంత్రం కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దిగువ మానేరు కింద 8.99లక్షల ఎకరాలకు యాసంగి పంటకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్ఎండీలో ప్రస్తుతం సుమారు 19 టీఎంసిల నీరు నిల్వ ఉందన్నారు. మిడ్ మానేరులో 23 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా రైతులకు యాసంగి పంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపారు. భవిష్యతులో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకురానుందని అన్నారు. రైతులకు గిట్టుబటు ధర, ఎరువులు, విత్తనాల సరఫరా లాంటి అనేక సంక్షేమ పథకాలను రైతులకు తీసుకురానుందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, క్యాబినేట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకే నీటిని విడుదల చేశామని తెలిపారు. రైతలుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కూడా ఆదేశించామని తెలిపారు. జిల్లాలోని 16మండలాల్లో ఇప్పటికే 4లక్షలకు పైగా ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలనర్నారు. తరువాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. ఇప్పటికే మహిళలకు సంబందించి ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణానికి స్పందన ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడిన 48 గంటల నుంచే ఈ పథకాన్ని ప్రవేశపెట్టాడం జరిగిందని కొనియడారు. డిసెంబరు 9 నుంచి 28వ తేది వరకు 6కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేశారని వివరించారు. ఇంకా ప్రజలకు ప్రయాణాల్లో ఇబ్బంది కలగకుండా ఇప్పటికే నూతనంగా బస్సులను తీసుకురావడం జరిగిందని అన్నారు. విడతల వారిగా 1080నూతన బస్సులు రానున్నట్లు తెలిపారు. అవి కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలుష్య నివరణ కొసం మరో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను మరో రెండు మూడు నెలల్లో తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. తెలిపారు. అందులో 500 జంటనగరాలకు మరో 500 జిల్లాలకు వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో పాటు రాష్ట్రంలో ఉన్న 364 బస్ స్టేషన్‌లు, 97 బస్ డిపోలు, 11రీజియన్‌లను ఏప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.. అంతకు ముందు ఎల్ఎండీ గెస్ట్ హౌస్ వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి, ఈఎన్‌సీ శంకర్, ఎస్ఈ శివకుమార్, ఈఈ నాగాభూషణం, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ కనకయ్య, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేములవాడలో భక్తుల రద్దీ


క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, డిసెంబరు 31: దక్షిణ కాశీ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపిస్తున్న క్రమంలో ఆదివారం నాడు వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకు న్నారు. భక్తుల రద్దీ కారణంగా లఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుండి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్ లో శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం సైతం భక్తులతో క్రిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తుల సంఖ్య భారీగా ఉండడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

ధర్మపురిలో మల్లన్న భక్తుల సందడి


ధర్మపురిలో స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 31: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం మల్లన్న భక్తుల సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. షష్ఠి వారోత్సవాల సందర్భంగా క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు నెత్తి మీద మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని త్రిశూలం చేత పట్టుకుని నది వద్దకు చేరుకున్నారు. అనంతరం గోదావరి నదిలో స్నానాలు చేశారు. అలాగే నదీ జలాలతో మల్లికార్జున విగ్రహాలను శుభ్రం చేశారు. నది వద్ద గల స్నానఘట్టాలు, ఇసుక మేటల పైన ప్రత్యేకంగా సైకత లింగాలు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని మెడలో పూల దండ వేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదేల, ఐనవోలు ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకునేందుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఎస్సై దత్తాత్రి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

గ్రామ పంచాయతీ ట్రాక్టర్ టైర్లు చోరీ

జమ్మికుంట రూరల్, డిసెంబరు 31: మండలం శాయంపేటలో గ్రామ పంచాయతీ కార్యాలయం ట్రాక్టర్ టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామంలో ఓ మహిళ మృత్యువాత పడింది. తొమ్మిదో రోజు స్నానాలు చేసేందుకు మంచినీళ్ల ట్యాంక్ కావాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి ఫోన్ చేశారు. దీంతో సిబ్బంది వాటర్ ట్యాంకర్ పంపించారు. స్నానాలు పూర్తి అయిన అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్యాంకర్ టైర్లు ఎత్తుకెళ్లారు. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


టైర్లు చోరీ చేసిన వాటర్ ట్యాంకర్

ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఢీ


● ఒకరి మృతి ● వెన్నంపల్లిలో విషాదం
● మరో నలుగురికి గాయాలు


ప్రేమ్‌కుమార్(ఫైల్)

రేగొండ, డిసెంబరు 31: ఆర్టీసీ బస్సును ఫ్లిప్‌కార్ట్ వ్యాను ఢీకొంది. దీంతో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు.బస్సు డ్రైవర్, కండక్టర్‌తోపాటు ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొత్తపల్లి గ్రామ శివారు పరకాల-భూపాలపల్లి ప్రధాన రహదారిలో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్సై మాధవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హనుమకొండకు బయల్దేరింది. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి భూపాలపల్లికి వెళ్తున్న ఫ్లిప్‌కార్ట్ కార్గో వ్యాన్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. దీంతో వ్యాన్ డ్రైవర్ ఈర్ల ప్రేమ్‌కుమార్ (28) కేబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. కొద్ది సేపు వరకు మృత్యువుతో పోరాడి చివరి శ్వాస విడిచాడు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ బీరబోయిన రమేష్, కండక్టర్ కృష్ణతోపాటు ప్రయాణికులు శ్రీలత, కుమార్‌కు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రేమ్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అదే ఆస్పత్రికి పంపారు. మృతుడు ప్రేమ్‌కుమార్ పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామస్థుడు. అతడు అవివాహితుడు కాగా తండ్రి బక్కయ్య, సోదరుడు రాజేష్‌తో కలిసి జీవిస్తున్నాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్: భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఆర్‌టీసీ బస్సు, డీసీఎం వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన ఈర్ల ప్రేమ్‌కుమార్(26) అనే యువకుడు మృతిచెందిన సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. ప్రేమ్ కుమార్ నాలుగేళ్లుగా కరీంనగర్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా రేగొండ మండలంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు బక్కయ్య, భాగ్యల రోదనలు మిన్నంటాయి.

శిథిలావస్థకు చేరుకున్న లోలెవల్ వంతెన


దెబ్బతిన్న లోలెవల్ వంతెన

ధర్మారం, డిసెంబరు 31: మండలంలోని కమ్మరీఖాన్‌పేటలోగల లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరి కూలుతోంది. వంతెన ఇరువైపుల కూలుతుండడం వలన రాత్రి సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. లోలెవల్ వంతెన(రోడ్యాం) పూర్తిగా దెబ్బతినడంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. 1985లో నిర్మించిన ఈ వంతెన దెబ్బతిని గుంతలుగా మారింది. దీంతో రైతులు పండించిన పంటను తీసుకరావాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. కమ్మరీఖాన్‌పేట ఎక్స్‌రోడ్‌నుంచి గ్రామం మీదుగా అబ్బాపూర్, జూలపల్లి వరకు నిత్యం వాహనాల రాకపోకలు ఎక్కువగ ఉంటాయి. అదేవిధంగా రోడ్డు కూడా చెడిపోవడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. లోలెవల్ వంతెనను, చెడిపోయిన వంతెనను మరమ్మతులు చేయాలని ప్రజలు అధికారులకు విన్నవించినా కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దెబ్బతిన్న వంతెనను పూర్తిగా తొలగించి మళ్లీ పునర్నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే


వృద్ధురాలిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 31 : మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పెద్దకల్వల గ్రామానికి చెందిన అర్గొండ మల్లమ్మ రోడ్డు ప్రమాదానికి గురై అపస్మారక స్థితిలో రోడ్డుపై పడిపోయింది. అటువైపు వెళ్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గమనించి వాహనాన్ని నిలిపి వృద్ధురాలిని ఆటోలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యులకు ఫోన్ ద్వారా ప్రమాదానికి గురైన వృద్ధురాలు మల్లమ్మకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

'నలిమెల'కు సాహితీవేత్తల అభినందనలు


అవార్డు అందుకుంటున్న నలిమెల భాస్కర్

సిరిసిల్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన బహుభాషా సాహితీవేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ ఆదివారం పాలకుర్తిలోని సోమనాథ కళాపీఠం పురస్కారాన్ని అందుకోవడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ వేత్తలు అభినందనలు తెలిపారు.డాక్టర్ నలిమెల భాస్కర్ సోమనాథ సామాజిక శోధన పురస్కారం అందు కోవడం గర్వంగా ఉందని జిల్లా కవులు, రచయితలు కొనియాడారు. అవార్డు ప్రదానోత్సవంలో రంగినేని ట్రస్ట్ చైర్మన్ రంగినేని మోహన్‌రావు, కవులు మద్దికుంట లక్ష్మణ్, ఆడెపు లక్ష్మణ్ ఉన్నారు.

'దళితబంధు'పై సమీక్ష చేయాలి

● మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం

గంభీరావుపేట, డిసెంబరు 31: దళితబంధు పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సమీక్ష జరపాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం పేర్కొన్నారు. గంభీరావుపేటలో ఆదివారం చంద్రం విలేఖరులతో మాట్లాడుతూ దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సమీక్ష చేసి, పునరుద్ధరించాలన్నారు. గత ప్రభుత్వం నియోజకవర్గానికి మొదటి విడత 100, రెండవవిడత 1100 మందికి దళితబంధు ఇచ్చి, చేతులు దులుపుకుందన్నారు. దళిబంధు పథకం కింద కుటుంబానికి రూ. 10 లక్షలు కాకుండా 15 లక్షలు ఇవ్వాలన్నారు. దళితబంధు పథకానికి సంబంధించి మాల మహానాడు పక్షాన త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వివరించనున్నట్టు తెలిపారు.

పద్మశాలి సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 31: ఎల్లారెడ్డిపేట గ్రామ పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపెల్లి దేవాంతం, ప్రధాన కార్యదర్శిగా వనం రమేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గోసికె దేవదాస్, శ్రీరాం సుదర్శన్, సంయుక్త కార్యదర్శిగా రాపెల్లి అంబదాస్, కోశాధికారిగా వనం బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుంపేటి గౌరీశంకర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా దోమల భాస్కర్, దైవశెట్టిగా మ్యాన భగవాన్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా గోసికె జనార్ధన్, మ్యాన రవీందర్, గోనె రవి, మద్రాల లక్ష్మణ్‌లు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా వనం బొందయ్య, వనం ఎల్లయ్య, గాజుల దేవదాస్, గుల్లపల్లి మహేశ్‌లు వ్యవహరించనున్నారు. యువజన విభాగం అధ్యక్షుడిగా సుంకి భాస్కర్, ఉపాధ్యక్షులుగా దూస శ్రీనివాస్, ఆడెపు శ్రీపతి, కార్యదర్శిగా ఆడెపు అజయ్, సంయుక్త కార్యదర్శులుగా గోసికె శ్రీనివాస్, సుంకి విష్ణుమూర్తిలను ఎన్నుకున్నారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి పాటు పడుతామని నూతనంగా ఎన్నికైన సభ్యులు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పోతు ఆంజనేయులు, సభ్యులు గంగారం, నాగరాజు, లక్ష్మీనారాయణ, రమేశ్, వేణు, నరేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 31: ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రధాని నరేంద్రమోదీ సందేశాన్ని వివరించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్రమ్మ, ఆయా శాఖల అధికారులు, నాయకులు బుగ్గారెడ్డి, పర్శరాములు, సత్యంరెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్, మూడు ట్రాక్టర్ల పట్టివేత

తంగళ్లపల్లి, డిసెంబరు 31: తంగళ్లపల్లి మండలంలోని మానేరు నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక టిప్పర్‌తో పాటు మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. డంపు చేసిన ఇసుకను టిప్పర్‌తో తరలిస్తుండగా టెక్స్‌టైల్ పార్కు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోని రామగుండం

- కోటి రూపాయల బోటు నీటి పాలు.. - వరదలకు రాజీవ్‌రహదారి పక్కకు.. - పట్టించుకునే వారు కరువు


రాజీవ్ రహదారి పక్కకు కొట్టుకువచ్చిన బోటు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 31: రామగుండాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని గత పాలకులు చెప్పినా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. సుందిళ్ల వద్ద బ్యారేజీ కట్టడంతో ఇక్కడ పర్యాట కేంద్రంగా అభివృద్ధి చేస్తామని అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్, అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోటి రూపాయల వ్యయంతో బోటును తీసుకువచ్చారు. అది ఇప్పటికీ కూడా ప్రారంభానికి నోచుకోలేదు. రెండుసార్లు గోదావరికి వరదలు వచ్చి రాజీవ్ రహదారి పక్కకు కొట్టుకువచ్చింది. గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ప్రజలు ఉల్లాసంగా గడిపేందుకు, పర్యాటకులు వచ్చేందుకు హరిత గెస్ట్‌హౌస్, టూరిజం బోట్లు ఏర్పాటుచేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఆ హామీ నెరవేరలేదు. రెండు సంవత్సరాల క్రితం పూణె నుంచి 30టన్నుల బరువు, 40సీట్ల కెపాసిటీతో ఉన్న బోటును తీసుకువచ్చారు. కానీ దానిని మాత్రం గోదావరిలో జలప్రవేశం చేయించలేదు. అందులో ఉన్న సీట్లు, విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. 2022 ఆగస్టులో వచ్చిన వరదలతో బోటు రాజీవ్ రహదారి పక్కన చెట్ల పొదల్లోకి కొట్టుకువచ్చింది. ఇప్పటివరకు ఆ బోటును బయటకు తీయలేదు. ఎన్నికల ముందు గోదావరిలో స్పీడ్ బోటును నాలుగు రోజులు నడిపి దానిని కూడా నిలిపివేశారు. గోలివాడ దిగువ నుంచి సుందిళ్ల బ్యారేజీ వరకు బోటును నడుపుతామని చెప్పినా ఇప్పటివరకు అది సాధ్యం కాలేదు. తెచ్చిన బోటు చెట్లపొదల్లో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో కోటి రూపాయలు గోదావరిపాలు అయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు చేపట్టాలని రామగుండం ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రామగుండాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా..

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



రామగుండాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా.. సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద గత పాలకుల నిర్లక్ష్యంతో కోటి రూపాయల బోటు నీటిపాలైంది.. దీనిపై విచారణ జరిపిస్తాం.. ఈప్రాంత ప్రజలు, కార్మికులు, వారి కుటుంబాలు ఉల్లాసంగా గడిపేందుకు టూరిజం స్పాట్‌ను ఏర్పాటు చేస్తాం..

నూతన సంవత్సర వేడుకల్లో పేకాట జోరు

- గోదావరిఖనిలో రెండు, ఎన్‌టీపీసీలోని ఓ హోటల్‌లో దందా - ప్రత్యేక ప్యాకేజీలతో ఆకర్షణ

కోల్‌సిటీ, డిసెంబరు 31: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నూతన సంవత్సర వేడుకల వేళ లాడ్జీలు, హోటళ్లలో పేకాట జోరుగా సాగుతోంది. గోదావరిఖనిలోని రెండు లాడ్జీలు, ఎన్‌టీపీసీలోని ఒక ప్రముఖ లాడ్జిలో నూతన సంవత్సర స్పెషల్ పేర పేకాట డెన్‌లు నిర్వహించారు. షోకు రూ.15వేల చొప్పున నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. గోదావరిఖనిలోని రూ.15వేల నుంచి రూ.20వేల గేమ్‌లు సాగగా ఎన్‌టీపీసీలో మాత్రం రూ.లక్ష వరకు న్యూ ఇయర్ గేమ్ నడిచినట్టు తెలుస్తోంది. మంచిర్యాల ప్రాంతం నుంచి వచ్చిన జూదగాళ్లు ఈ లక్ష గేమ్‌లో భాగస్వాములైనట్టు చర్చ జరుగుతోంది. వీరితో పాటు పెద్దపల్లి ప్రాంతం నుంచి వచ్చిన జూదరులకు కూడా స్పెషల్ ప్యాకేజీ పెట్టినట్టు తెలుస్తోంది. వీరిలో పలువురు రైస్ మిల్లర్లు, ఇటుక బట్టీల నిర్వాహకులు, వ్యాపారులు ఉన్నట్టు సమాచారం. ఎన్నికలకు ముందు సంబంధిత హోటళ్లలో పేకాట ఏడాదికాలంగా నిరాటంకగా సాగింది. పోలీసులు దాడి చేయని రక్షణ కవచంగా కూడా సంబంధిత హోటల్‌కు పేరుంది. ఇప్పుడు న్యూఇయర్ వేడుకల పేర ప్యాకేజీలు పెట్టి జూదరులను ఆకర్షించినట్టు తెలుస్తోంది.

అయితే పేకాట జరుగుతున్న హోటళ్ల యజమానులు మాత్రం పోలీస్ రైడ్స్ ఫ్రీజోన్లుగా ప్రకటించుకుని దందా సాగించడం గమనార్హం. నూతన సంవత్సరం సందర్భంగానే నిర్వాహకులకు ఆదాయం లక్షల్లో సమకూరుతున్నట్టు తెలుస్తున్నది.

అధికారబలంతో ఏడు గ్రామాలు మున్సిపల్‌లో విలీనం

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 31: సిరిసిల్ల మున్సిపల్‌లో ఏడు గ్రామాలను విలీనం చేయకూడదని ఆ ఏడు గ్రామాల ప్రజలు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చి, ఆందోళనలు చేపట్టినా ప్రజలను పట్టించుకోకుండా మంద బలం ఉందికదా అని ఏడు గ్రామాలను బలవంతంగా మున్సిపల్‌లో విలీనం చేశారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. అధికారంలో ఉన్నామనుకుంటూ మతిభ్రమించి సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అనేక తీర్మానాలు చేస్తున్నారని అన్నారు. మొన్నటి వరకు మంత్రిగా ప్రాతినిధ్యం వహించి ప్రస్తుతం సిరిసిల్ల ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడు తున్నాడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులు కూడా పూర్తికాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తెల్లవారు నుంచే కేటీఆర్ శాప నార్థాలు పెట్టడం మొదలు పెట్టారని అన్నారు. ఎన్నికల సమయంలో కేకే మహేందర్‌రెడ్డి మున్సిపల్‌లో విలీనమైన గ్రామాలను గ్రామ పంచాయితీలు చేస్తా నన్నాడని ముందుగానే కేటీఆర్ ముందుండాలని విలీన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలను చేయాలని మున్సిపల్‌లో తీర్మానం చేయించినంత మాత్రాన చిత్తశుద్ధిని చాటుకున్నట్లు కాదన్నారు. ఎన్నికల సమయంలో మేము హామీనిచ్చాం నేను ఇక్కడ ఓడిపోయి మా ప్రభుత్వం అధికారంలోకి ఉంది. దాన్ని నెరవేరుస్తామన్నారు. ఏడు గ్రామాలకు క్షమాపణ చెప్పకుండా చనిపోయిన కుటుంబా లను పరమార్శించకుండా కంటితుడుపు చర్యగా మున్సిపల్ తీర్మానం చేయించ డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సిరిసిల్ల మున్సిపల్‌లో జరిగిన అవినీ తిపై కూడా విచారణ జరపాలని తీర్మానం చేస్తే మీ బండారం బయటపడేదని అన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

మున్సిపల్‌లో ఏడు గ్రామాల విలీనం వెనక ఎటువంటి కుట్ర దాగుందో బహిర్గతం అయ్యేదన్నారు. కొందరు ఆటో యూనియన్‌లకు అధ్యక్షుడిగా వ్యవహ రిస్తూ పుల్లలు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. సిరిసిల్లలో అర్హులైన వారి పొట్టలు కొట్టి అనర్హులకు డబుల బెడ్‌రూం ఇళ్లు ఇచ్చి అవినీతికి పాల్పడిన వారు మాకు సూచనలు చేయడం సిగ్గుచేటన్నారు. పవర్ లూమ్స్‌కు రూ. 49 కోట్ల కరెంట్ సబ్సిడీ రావాల్సి ఉండగా సెస్ నుంచి నోటీసులు వచ్చినా సబ్సిడీ ఎందుకు కట్టలేదో నన్ను విమర్శించిన వారు కేటీఆర్‌ను అడిగాల్సి ఉండేదని అన్నారు. తెలంగాణను దాదాపు రూ. 7లక్షల కోట్లు అప్పుల ఊబిలో నెట్టిన కేటీఆర్, కేటీఆర్ ఘనతేనని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మాజీ కౌన్సిలర్ యెల్ల లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే పలు అంశాలపై తీర్మానం

● మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 31: తెలంగాణ ప్రభుత్వాన్ని మున్సిపల్ సమావే శంలో నిందించలేదని, ఆరు గ్యారెంటీలు, ప్రజాపాలన దరఖాస్తులపై వార్డు ప్రజల సమస్యలను చర్చించి ప్రభుత్వం దృష్టికి తెసుకెళ్లాలని పలు అంశాలపై తీర్మానాలు ఆమోదించామని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. ఆదివా రం సిరిసిల్ల పట్టణం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డిపై చైర్ పర్సన్, బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ సమావేశంలో ప్రభుత్వాన్ని కించపరిచే విధంగా మాట్లాడలేదన్నారు. కేకే మహేందర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాద న్నారు. సిరిసిల్ల మున్సిపల్ ప్రథమ పౌరురాలుగా అడిగే హక్కు ఉందన్నారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులో ప్రజలు ప్రజాపాలన దరఖాస్తులు చేసుకో వడంలో కొన్ని ఇబ్బందులు వస్తున్నందున వాటిని మున్సిపల్ పక్షాన ప్రభుత్వానికి నివేదిక పంపించాలని భావించామన్నారు. సిరిసిల్ల మున్సిపల్ 15వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు నూతన రేషన్ కార్డు, పింఛన్‌లపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపామన్నారు. రాష్ట్రంలో అధికారం ఉందని కేకే మహేందర్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతే బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదని సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి హెచ్చ రించారు. గెలిచిన తరువాత వెంటనే కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్న ముఖ్య మంత్రి ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు లేవన్న ఆందోళనతో ఆరు గ్యారెంటీలపై మున్సిపల్ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. పట్టణంను అనుకున్న ఏడు గ్రామాలను విలీనం చేసుకొని సిరిసిల్ల రూపు రేఖలను మార్చాలన్న ఆలోచనతో విలీనం చేయడం జరిగిందన్నారు. విలీన గ్రామాలలో కేటీఆర్ ఎక్కడైనా స్థలాలను తీసుకొని ఆఫీసుగానీ ఫ్యాక్టరీ కట్టుకున్నాడా అన్ని ప్రశ్నించారు. పద్మశాలీలను కాపాడుకుంటామన్న కేకే మహేం దర్‌రెడ్డి తక్షణమే ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి బిల్లులు చెల్లించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, మహిళా పట్టణ అధ్యక్షురాలు బత్తుల వనజ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్ పర్సన్ కళ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చక్రపాణి

పశువైద్యం అందక రైతుల ఇబ్బందులు

● ఇల్లంతకుంట ఆసుపత్రిలో సిబ్బంది నిల్


ఇల్లంతకుంటలోని పశువైద్యశాల

ఇల్లంతకుంట, డిసెంబరు 31: పశువులు అస్వస్థతకు గురయినప్పుడు సరైన వైద్యం అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో ఇల్లంతకుంట, గాలిపెల్లి గ్రామాలలో పశువైద్యశాలలు కొనసాగుతున్నాయి. ఇల్లంతకుంట పశువైద్యశాల పరిధిలో 26 గ్రామ పంచాయతీలు. గాలిపెల్లి పశువైద్యశాల పరిధిలో 7 గ్రామపంచాయతీలు ఉంటాయి. ఇల్లంతకుంటలోని పశువైద్యశాలలో పశువైద్యాధికారి, పశువైద్య సహాయకుడు, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఖాళీగా ఉన్నా యి. గాలిపెల్లి పశువైద్యశాలలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఇల్లంతకుంట ఆసుపత్రికి గాలిపెల్లి పశువైద్యాధికారి సతీష్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. ఇల్లంతకుంట ఆసుపత్రిని ఉదయం తెరిచే వారే లేకపోవడంతో జిల్లా అధికారుల దృష్టికి తేవడంతో సిరిసిల్ల నుంచి ఆఫీస్‌సబార్డినేట్‌ను డిప్యుటేషన్‌పై పంపించారు. ఇల్లంతకుంట ఆసుపత్రి పరిధిలో 12 వేల పశువులు, 43 వేల గొర్రెలు, మేకలతో పాటు పెరటికోళ్లు ఉన్నాయి. వీటన్నింటికీ వైద్యం అందించే అధికారులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కందికట్కూర్, రేపాక, పెద్దలింగాపూర్ గ్రామాలలో పశువైద్యశాలలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపినా ఇంత వరకు మంజూరు కాలేదు. ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి పశువైద్యశాలలను పెంచడంతో పాటు పూర్తిస్థాయి అధికారులను నియమించాలని రైతులు కోరుచున్నారు.

గోపాలమిత్రలకు అందని వేతనాలు

పశువులకు ప్రాథమిక వైద్యం అందించడానికి నియమించిన గోపాలమిత్రలు మండలంలో నలుగురు ఉన్నారు. వీరికి గత ఎనిమిది నెలలుగా వేతనాలు రావడం లేదు. అంతేకాకుండా ప్రతి నెల సెమన్ కొనుగోలు చేయడానికి స్వంతం గా డబ్బులు చెల్లించవలసి వస్తోందని గోపాల మిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు గడువడానికి ఇబ్బందులు పడుతు న్నామని ఇప్పటికైనా వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న 2003-04 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు31: పెద్దపల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2003-04 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు నాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. సమ్మేళనానికి వచ్చిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు రాఘవపూర్ విద్యార్థులు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు హన్మంతు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 31: జనవరి 1 నుంచి 3 వరకు మహబూబ్‌నగర్‌లో జరగబోయే హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-17 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు విద్యార్థులను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. ఎంపికైనా వారిలో దూలం వైష్ణవి, తిరుమల, హసిని క్రీడాకారులు ఉన్నట్లు పాఠశాల పీఈటి సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ విప్ పరామర్శ

ధర్మారం, డిసెంబరు31: ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన పడిదం హరీష్, కూతురు నగేష్ అనే యువకులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆదివారం వారి కుటుంబాలను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ. 5వేల చొప్పున ఆర్థిక సహాయంను ఆయన అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గందం మహేందర్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

షటిల్ టోర్నీ విజేత సుల్తానాబాద్


విజేతలకు కప్ అందజేస్తున్న శంకర్

ఓదెల, డిసెంబరు 31: మండల కేంద్రంలో నిర్వహించిన మూడు మండలాల షటిల్ టోర్నీలో సుల్తానాబాద్ క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ఈనెల 28న ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించిన ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల షటిల్ టోర్నమెంట్ శనివారం రాత్రి ముగిసింది. హోరాహోరీ పోటిలో డబుల్స్‌లో సుల్తానాబాద్‌కు చెందిన ఇక్బాల్, సత్యం విజేతలుగా నిలిచారు. ఓదెలకు చెందిన రామినేని అనిల్, చక్రి ద్వితీయ స్థానంలో నిలిచారు. సింగిల్స్‌లో సుల్తానాబాద్ చెందిన అజయ్ ప్రథమ, ఓదెలకు చెందిన అనిల్ కుమార్ ద్వితీయ బహుమతి సాధించారు. డబుల్స్ విజేతలకు రూ. ఐదువేలు, టోర్నీ కప్, అలాగే ద్వితీయ విజేతలకు రూ.3 వేలు, సింగిల్స్‌లో రూ.3, రెండు వేల చొప్పున మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్, రామంచ అనిల్‌కుమార్ అందజేశారు. నాలుగు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీలో డబుల్ 20, సింగిల్స్ 20, క్రీడాబృందాలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తీర్థాల కుమారస్వామి, నాగపురి రవీందర్, గోపతి సదానందం, సిద్ధివినాయక యూత్ ఆర్గనైజర్లు రామినేని అనిల్, తిరుపతి, స్వామి, అజయ్‌కుమార్, కిరణ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

దీక్షాపరులకు ఇరుముడి చద్దర్ల పంపిణీ


స్వాములకు ఇరుముడి చద్దర్ల పంపిణీ చేస్తున్న దృశ్యం

మంథని, డిసెంబరు 31: శ్రీఅయ్యప్పస్వామి దీక్షాపరులకు మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన జంగ సుమన్‌స్వామి స్థానిక శ్రీఅయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఇరుముడి సంబంధించిన చద్దర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, దీక్షాపరులు పాల్గొన్నారు.

రాముల వారి అక్షింతలతో శోభాయాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

రామగిరి, డిసెంబరు 31: అయోధ్య రాముని పాదాలను తాకిన అక్షింతలు నిండిన కలశాలతో ఆదివారం మండలంలోని కల్వచర్ల పురవీధుల్లో భక్తులు శోభాయాత్రను నిర్వహించారు.అనంతరం వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజాలను నిర్వహించారు. రాముల వారి అక్షింతలను ప్రతి ఇంటికి అందజేస్తామని స్థానిక సర్పంచ్ గంటపద్మ, మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకటరమణరెడ్డి, బూసకనకయ్య, కొమురవెల్లి వెంకటరమణ, శివరామకృష్ణ భజన మండలి భక్త బృందం తెలిపారు.

గడప గడపకూ అయోధ్య రాముల వారి అక్షింతలు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 31 : మండలంలోని సబ్బితం గ్రామంలో ఆదివారం గడప గడపకూ అయోధ్య రాముల వారి అక్షింతలను పంపిణీ చేశారు. గీతాసత్సంగ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, ఆర్ఎస్ఎస్ నాయకులు, గ్రామ సర్పంచ్ చుంచు సదయ్యలు రాములవారి అక్షింతలను అందజేశారు.